క్లుప్తంగా

ఆదివాసీ మహిళలకు పెన్షన్ ఇవ్వాలి

ఇచ్చోడ: అర్హులైన ఆదివాసీ మహిళలకు పెన్షన్లు ఇవ్వాలని ముఖరా(బి) మాజీ సర్పంచ్ అడప్ మారుతి ఎంపీడీవో లక్ష్మణ్‌ను కోరారు. బుధవారం ఆదివాసీ మహిళలతో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖరా(బి) పంచాయతీ పరిధిలో మాన్కుగూడ, రఘుగూడ గ్రామాల్లో 15 మంది భర్తలు చనిపోయిన ఆదివాసీ మహిళలు పెన్షన్ కోసం దరఖాస్తులు చేసుకొని సంవత్సరం గడుస్తున్నా.. వారికి పెన్షన్ రావడం లేదన్నారు. వారికి ఎలాంటి ఆసరా లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఇచ్చోడ: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆదిలాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ డీఎస్పీ హసీబుల్లా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు సైబర్ మోసాల భారిన పడి చాలా మంది మోసపోతున్నారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజీలకు స్పందించవద్దన్నారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై నరేశ్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, షీటీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నార్నూర్: సీజనల్ వ్యాధులతో పాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారి సంజీవ్ అన్నారు. బుధవారం గాదిగూడ మండలంలోని ఝరి పీహెచ్‌సీ పరిధిలో డాబా (బి) గ్రామానికి చెందిన దుర్గంలక్ష్మి అనే గర్భిణి రక్తహీనతతో బాధపడుతుంది. హైరిస్క్ ఉండడంతో ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు రీఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అడే సంజయ్, ఏఎన్ఎం శ్రీదేవి, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలని లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నూటెంకి సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో లయన్స్ క్లబ్ కింగ్ అండ్ కాటన్ సిటీ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోశాధికారి బెజ్జంకి రవీంద్ర, నరేందర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, డెంగ్యూ వచ్చినట్లు తెలిస్తే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఏఈ ఫేరోజ్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుభరోసాపై చర్చ

బోథ్: మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక రైతువేదికలో ఎంపీపీ తుల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు విద్యుత్ కోతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించాలని కోరారు. చివరి సర్వసభ్య సమావేశం కావడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుల శ్రీ నివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, అధికారులు మొక్కలు నాటారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కదం ప్రశాంత్, ఎంపీడీవో రమేశ్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు

ఉట్నూర్‌రూరల్: విధుల్లో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు లభిస్తుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం ఆఫీస్ ఆర్డినేట్ నర్సయ్య, దఫేదార్‌గా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందిన లక్ష్మణ్‌లను ఆమె సన్మానించారు. ఇరువురి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఈఈ రాథోడ్‌భీం రావు, డీడీ దిలీప్ కుమార్, ఏవో రాంబాబు, పీహెచ్‌వో సందీప్, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, మెస్రంమ నోహర్, మేనేజర్ లింగు పాల్గొన్నారు.

ముగిసిన పదవీకాలం

- జెడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానించిన అధికారులు


బోథ్: ఎంపీటీసీలు, సర్పంచులతో ఎంపీపీ, జెడ్పీటీసీ

బోథ్: ఎంపీపీ, ఎంపీటీసీల, జెడ్పీటీసీ పదవీకాలం గురువారంతో ముగియనుండగా.. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారిని మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ శాఖలకు అధికారులు శాలువాతో సత్కరించారు. ఐదేళ్లలో మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఈ ఐదేళ్లలో అన్ని వర్గాలకు న్యాయం చేశామని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. జెడ్పీటీసీగా ప్రజలు ఇచ్చిన పదవి సంతృప్తి ఇచ్చిందని జెడ్పీటీసీ సంధ్యారాణి అన్నారు.

రాజకీయ నాయకులకు పదవీ విరమణ ఉండదు

నేరడిగొండ: రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేయడంలో పదవీ విరమణ ఉండదని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్‌లు అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల పరిషత్ పాలకవర్గసభ్యులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీపీ రాథోడ్ సజన్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలను తహసీల్దార్, ఎంపీడీవో, ఐకేపీ, ఉపాధిహామీ కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి..

తలమడుగు: జెడ్పీటీసీ పదవీకాలం ముగిసిన ప్రజలకు అందుబాటులో ఉంటానని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆర్లి (టి) గ్రామంలో 15 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన సవారిబంగ్లాను ప్రారంభించారు. ఐదేళ్ల జెడ్పీటీసీ పదవికాలంలో ఎంపీపీ, ఎంపీటీసీల సహకారంతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సుంకిడి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాండ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీటీసీలు రమేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, బాబుఖాన్, శ్రీనివాసరెడ్డి, ప్రతాప్, కిష్టన్న, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

– నిరంతరం ప్రజాసేవ చేసే వారికి పదవి విరమణ ఉండదని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు.

బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల పరిషత్ కార్యాలయలో ప్రజాప్రతినిధులను అధికారులు ఘనంగా సన్మానించారు. పార్టీలకు అతీతంగా అధికారుల సమన్వయంతో మండలాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. పదవికాలం ముగిసిన జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిని, ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్‌ను, ఎంపీటీసీలను, మాజీ సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. తాహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, దూదిరాం రాథోడ్ పాల్గొన్నారు.

తాంసి: నూతనంగా ఏర్పడిన భీంపూర్ మండలాన్ని ఐదేళ్లలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేశామని భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ అన్నారు. బుధవారం ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు.

ఎంపీపీ, జెడ్పీటీసీలకు సన్మానం..

ఐదేళ్ల పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా సేవలను అందించిన ప్రజాప్రతినిధులకు పదవీకాలం ముగుస్తుండటంతో వారిని ఘనంగా సన్మానించారు. మండల అధికారులతో పాటు స్థానిక నాయకులు ఎంపీపీ రత్నప్రభ, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీటీసీలను సత్కరించారు.

ఆదిలాబాద్ రూరల్: ఎంపీపీ, ఎంపీటీసీల పదవికాలం గురువారంతో ముగియనుండడంతో బుధవారం మావల ఎంపీపీ దర్శనాల సంగీత, వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ నల్ల వనిత, ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మావల మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు, ఎంపీవో శోభన, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఐదేళ్ల పాటు మండల ప్రజాప్రతినిధులుగా ఉంటూ అధికారులు, మాజీ మంత్రి సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎంపీపీ గండ్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఆరీఫ్ అన్నారు. ఎంపీటీసీల పదవీకాలం గురువారంతో ముగియనుండడంతో వారిని అధికారులు ఆదిలాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో శాలువాతో బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో వెంకట రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఈజీఎస్ ఏపీవో జాకీర్ ఉ స్సేన్, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గీతాంజలి, జూనియర్ అసిస్టెంట్ గజానంద్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జైనథ్: ఎంపిటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సభ్యులను అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డిలు మాట్లాడుతూ... ఏళ్ల పాటు పాలనలో సహకరించిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపీడీవో రవీంద్రనాథ్, తహసీల్దార్ శ్యాంసుందర్, తదితరులు ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలను ఘనంగా సన్మానించారు.

చిత్తశుద్ధితో పని చేయాలి

సిరికొండ: అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీలకు ఇది చివరి సమావేశం కావడంతో అధికారులు ప్రజాప్రతినిధులను శాలువాతో సన్మానించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నేరడిగొండ: ఎంపీపీని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు


తలమడుగు: ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు


తాంసి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుధాకర్


మాట్లాడుతున్న ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్

అభివృద్ధి పనులు ప్రారంభం


నల్లా ప్రారంభిస్తున్న ఎంపీపీ

బేల: డబుల్ బెడ్‌రూంలకు ప్రత్యేక అభివృద్ధి నిధులతో ప్రతిఇంటికీ నీరు అందిస్తామని ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్ అన్నారు. బుధవారం మండలంలోని మాంగ్రుడ్ గ్రామంలో డబుల్ బెడ్‌రూంలకు రూ.23 లక్షలతో నిర్మించిన సురక్షిత ట్యాంకుతో నల్లా నీటి సౌకర్యాన్ని ఆమె ప్రారంభిచారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో రూ.3లక్షలతో మరాఠీ మీడియం ప్రాథమిక పాఠశాల, రూ. 2.95లక్షల వ్యయంతో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఠాక్రే అర్చన మంగేష్, గ్రామ సమైఖ్య అధ్యక్షురాలు డాక్రే విద్య బాయి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలను రెచ్చగొట్టడం సరికాదు'


మాట్లాడుతున్న ఎంపీపీ జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కతో జరిగిన ప్రొటోకాల్ వివాదాన్ని ఆసరా చేసుకొని ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆదివాసీ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై ఆదివాసీ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో ఆరోపణలు చేయించడం సరికాదని ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఆత్రం తిరుపతి, పంద్ర మాణిక్‌రావు, ఆనంరరావు, దూట మహేందర్, మర్సుకోల దేవ్ పాల్గొన్నారు.

మహాజన సభకు స్పందన


మాట్లాడుతున్న బాలూరి గోవర్ధన్‌రెడ్డి

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన మహాజన సభకు భారీ స్పందన వచ్చింది. మొత్తం 82 మంది రైతులు హాజరై, రైతుభరోసాపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గరిష్టంగా 36 మంది పాస్‌బుక్ యూనిట్‌గా 10 ఎకరాల వరకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని కోరగా.. మరో 30 మంది 5 ఎకరాల వరకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుభరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా రైతుల నుంచి అభిప్రాయాలను కోరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, ఏవో వివేక్, రైతులు పాల్గొన్నారు.

రూ.10వేల వేతనం అందించాలి


నినాదాలు చేస్తున్న కుంటాల రాములు, మధ్యాహ్న భోజన కార్మికులు

జైనథ్: కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఇచ్చిన పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. 10వేల వేతనం అందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్ బిల్లులతో పాటు పెంచిన బిల్లులు సైతం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు వంట పాత్రలు అందించాలన్నారు. తహసీల్దార్ నుంచి గుర్తింపు కార్డులు జారీతో పాటు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

మంత్రి సీతక్కను విమర్శించడం సరికాదు


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ ఆదివాసీ విభాగం జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో పర్యటించిన ఆయన అంకోలి గ్రామంలోని కుమరం భీం విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు అనేక అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మతిస్థిమితం, విచక్షణ కోల్పోయి మాట్లాడడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ గౌడ్, కాంతా రెడ్డి, బడుగు గంగన్న, కిషన్, సత్యనారాయణ, ఆనంద్ రావ్, మెస్రం శంకర్, లస్మ రెడ్డి, ముత్తన్న, అశోక్, రమేశ్, అఫ్సార్, తిరుపతి, పెద్ద స్వామి, చిన్నస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏడీఈ విజయసారథి

బజార్‌హత్నూర్: కొలారి పంట పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్‌లో వంగిన విద్యుత్ స్తంభం తొలగించి, కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు విద్యుత్ సిబ్బంది చేపట్టారు. బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వంగిన స్తంభం.. నిలిచిన సరఫరా', 'విదు ్యత్ సబ్‌స్టేషన్ ముట్టడి' రెండు కథనాలకు విద్యుత్‌శాఖ ఏడీఈ విజయసారథి స్పందించారు. బుధవారం ఉదయమే దేగామ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని టెంబి, మంజరంతండా, ధరంపురి, అ నంతపూర్ రైతులను, మాజీ సర్పంచులను పిలిపించుకుని మాట్లాడారు. టెంబి రూట్, గంగాపూర్ రూట్‌లో వేర్వేరుగా విద్యుత్ లైన్ బ్రేకర్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కొలారి గ్రామం వద్ద విద్యుత్‌లైన్ పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, రాంరెడ్డి, గంగ నారాయణ పాల్గొన్నారు.

నేడు 'బొంతల ముచ్చట్లు' ఆవిష్కరణ

బోథ్: ప్రముఖ సాగు నీటిపారుదల నిపుణులు, బోథ్ వాసి శ్రీధర్ దేశ్‌పాండే రాసిన 'బొంతల ముచ్చట్లు' అనే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించనున్నారు. బోథ్ మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో కాలనీవాసులతో పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. బోథ్‌కు సంబంధించిన ముచ్చట్లు పుస్తకంలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బోథ్ వాసులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని హీరాపూర్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ జేఈ రోహిదాస్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సమస్యలపై దరఖాస్తు స్వీకరించడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా సీజీఆర్ఎఫ్ చైర్మన్ రామకృష్ణ, విద్యుత్ శాఖ డివిజన్, జిల్లా అధి కారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి: పదవికాలం పూర్తయిన నిత్యం ప్రజల్లో ఉంటూ.. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీల పదవికాలం ముగియడంతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సమావేశానికి హాజరై మాట్లాడారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. అభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలో అందేవిధంగా చూస్తామన్నారు. ఆగస్టు 15లోపు రూ. 2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పదవికాలం పూర్తయిన ప్రజాప్రతినిధులను సన్మానించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ అర్క పుష్పలత పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: గ్రామాల్లో పారిశుధ్యంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నివారణపై నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షకాలంలో గ్రామాల్లో మురికి నీరురోడ్లపై పారకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు ఉంచవద్దన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి సాగర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తాంసి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి కిషన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో గోపాలకృష్ణరెడ్డితో కలిసి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండడంతో నీటిని తొలగించాలని సూచించారు. డ్రెయినేజీలు శుభ్రం చేయడంతో పాటు నీరునిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. వారి వెంట వైద్యాధికారి నిఖిల్‌రాజ్, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సాయినంద, పాఠశాల హెచ్ఎం కాంచన, ఉపాధ్యాయులు మహేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిధులు కేటాయించాలని వినతి

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామ సమీపంలో వాగుపై నూతన వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ మంత్రి సీతక్కకు బుధవారం విన్నవించారు. రూ. 8 కోట్ల 60 లక్షలు కేటాయించాలని కోరారు. కాగా వంతెన నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పంచాయతీశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

పశువులకు టీకాలు వేయించాలి

తలమడుగు: పశుపోషకులు తమ పశువులకు తప్పనిసరిగా లంపిస్కిన్ టీకాలు వేయించాలని జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నాడు. బుధవారం మండలంలోని ఆర్లి (టి) గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ వ్యాధి ఒక పశువు నుంచి మరో పశువుకు సోకే అవకాశం ఉందన్నారు. అనంతరం పదవికాలం ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను పశువైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్, మాజీ సర్పంచ్ కిష్టన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతుభరోసాపై సభ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుభరోసాపై మహాజన సభ నిర్వహించడం జరుగుతుందని పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ధరంసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి అధికారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులతో పాటు బదిలీలు, పదోన్నతలపై వేరే పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు గణేష్, మహేందర్, ప్రశాంత్‌బాబు, సంధ్యారాణి, లక్ష్మీలను సత్కరించారు.

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు'

నార్నూర్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉర్వేత రూప్‌దేవ్, అడే సురేశ్‌లు అన్నారు. ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేయడంతో పాటు ఆమెను అవమానించేలా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయకులు తోడసం నాగోరావ్, మెస్రం హనుమంతరావు, విష్ణు ఫడ్, సయ్యద్ ఖాసిం, శివాజీ రాథోడ్, సుభాష్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

6న 'చలో రాజ్‌భవన్'


మాట్లాడుతున్న జగన్ సింగ్

ఎదులాపురం: పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జూలై 6న సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమరం భీమ్ భవన్‌లో బుధవారం మాట్లాడారు. ఇజ్రాయిల్ 1948 సంవత్సరంలో అమెరికా ప్రోత్సాహంతో ఏర్పడిన యూదుల దేశమన్నారు. నాటి నుంచి నేటి వరకు పాలస్తీనా ప్రజలపైన ఇజ్రాయిల్ దౌర్జన్యానికి పాల్పడుతుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు సురేశ్, సాయికుమార్, శీను, లక్ష్మణ్, రేణుక పాల్గొన్నారు.